సాక్షి రంగారెడ్డి

శుక్రవారం । 30 । ఆగస్టు । 2024



తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తదితరులు



చావిడిపై మొలకల బుట్టలకు నీరు పడుతున్న యువతులు

రేపు షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో ఫోన్ ఇన్

గ్రామాలు, పట్టణాల్లో విషజ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఆస్పత్రులకు బాధితులు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై ఫోన్ ఇన్ ద్వారా షాద్‌నగర్ ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం: విష జ్వరాలు, డెంగీ, చికున్‌గున్యా తదితర సీజనల్ వ్యాధులు

డాక్టర్: శ్రీనివాస్‌రెడ్డి, షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్

తేదీ: 31.08.2024 (శనివారం)

సమయం: మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73862 17171



వహ్.. తీజ్

కడ్తాల్ మండలం గానుగుమార్లతండాలో గురువారం తీజ్ సంబురాలు అంబరాన్నంటాయి. తొమ్మిదిరోజులుగా తండాకు చెందిన యువతులు నియమ నిష్టలతో ధాన్యాలతో కూడిన మొలకల బుట్టలను తయారు చేశారు. గురువారం వాటిని ఎత్తుకుని బ్యాండు మేళాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం నిమజ్జనం సందర్భంగా సంప్రదాయ నృత్యాలు, కేరింతలతో సందడి చేశారు. స్థానిక చెరువులో మొలకల బుట్టలను నిమజ్జనం చేశారు. వేడుకలకు ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, సబితారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఐపీఎస్ మాజీ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తదితరులు హాజరయ్యారు. – కడ్తాల్



మొలకల బుట్టతో యువతులు

న్యూస్‌రీల్

1వ తేదీ నుంచి ఖోఖో సెలక్షన్స్

తుర్కయంజాల్: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సబ్ జూనియర్స్ ఖోఖో సెలక్షన్స్ సెప్టెంబర్ 1వ తేదీ నుంచి సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి తోట జయప్రకాష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలబాలికలు 2010 అక్టోబర్ 3వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. వివరాలకు 92923 03090, 99669 03823 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.


హెచ్ఐవీ సోకిన గర్భిణులకు తగిన చికిత్స అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

తుక్కుగూడ: హెచ్ఐవీ సోకిన గర్భిణులకు తగిన చికిత్స అందించాలని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశానుసారం జిల్లా ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్ఐవీ ఎయిడ్స్ (దిశ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణికి హెచ్ఐవీ పరీక్షలు తప్పనిసరి నిర్వహించాలన్నారు. వ్యాధి సోకిన వారికి యాంటీ రిట్రో వైరల్ తెరపీ (ఏఆర్‌టీ) మందుల గురించి తెలిపి, వాటిని క్రమం తప్పకుండా వాడేలా చర్య లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్ఓ పాపారావు, దిశ క్లస్టర్ మేనేజర్ నరేందర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నక్షా రోడ్డును ఆక్రమించారని ఆందోళన



ఇబ్రహీంపట్నం రూరల్: నక్షా రోడ్డును రియల్టర్లు కబ్జా చేశారని రైతులు ఆందోళనకు దిగారు. ఈ సంఘటన ఆదిబట్ల మున్సిపల్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. కొంగరకలాన్‌లోని దేవరకొండ నక్షా రోడ్డును రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసిందని, తమ భూముల్లోకి వెళ్లకుండా గోడలు కట్టి భయభ్రాంతులకు గురి చేస్తోందని రైతులు వాపోయారు. సర్వే నంబర్ 41,61లో దేవరకొండ నక్షా రోడ్డును 15 ఫీట్లతో ఏర్పాటు చేసుకుంటే పక్కనే ఉన్న రియల్ ఎస్టేట్ సంస్థ ఆక్రమించిందని ఆరోపించారు. కొంగరకలాన్ శ్లోక ఫంక్షన్ హాల్ నుంచి నారాయణ స్కూల్ వరకు రోడ్డు వేసుకుని తమ భూముల్లోకి వెళ్లేవారమని చెప్పారు. సదరు రియల్ ఎస్టేట్ సంస్థ తమ భూముల్లోకి వెళ్లనీయడం లేదని ధర్నాకు దిగారు. ధర్నా చేస్తున్న తమను బౌన్సర్లను పెట్టి అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ రోడ్డును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమాచారం అందుకున్న ఎస్ఐ వెంకటేశ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు పట్టించుకోవడం లేదని రైతులు నిలదీశారు. ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హామీ ఇచ్చారు. కాగా, రియల్ ఎస్టేట్‌సంస్థ యాజమాన్యం మాత్రం తాము ఎవరి భూములు, రోడ్లు ఆక్రమించలేదని చెబుతోంది.

మాఫీపై భరోసా

రుణమాఫీపై ప్రభుత్వం దృష్టి

- అర్హులందరికీ వర్తింపచేస్తామని హామీ
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా యాప్
- క్షేత్రస్థాయిలో రైతుల వివరాలు సేకరిస్తున్న అధికారులు



యాప్‌లో నమోదు చేసేందుకు రైతు కుటుంబంతో సెల్ఫీ తీసుకుంటున్న అధికారి

షాద్‌నగర్: ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ప్రతిష్టాత్మకంగా రుణమాఫీ పథకాన్ని చేపట్టింది. వివిధ కారణాలతో పలువురు రైతులకు మాఫీ కాకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని.. అర్హులందరికీ రుణమాఫీ అవుతుందని ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఈ మేరకు సమస్యలు పరిష్కరించేందుకు చర్యలకు ఉపక్రమించింది. రైతు భరోసా పంట రుణమాఫీ పేరిట ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించింది. రైతుల వివరాలు నమోదు చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయి పర్యటన చేస్తున్నారు.

ఇదీ జరిగే ప్రక్రియ..

రైతు భరోసా యాప్‌ను మండల వ్యవసాయ అధికారులు లాగిన్ చేయాల్సి ఉంటుంది. క్రాప్ లోన్ వేయివర్ ఆప్షన్‌లోకి వెళ్లి దరఖాస్తుదారు తీసుకున్న బ్యాంకు పేరు, బ్రాంచి వివరాలు పొందుపర్చగానే సదరు బ్యాంకులో ఉన్న రైతుల వివరాలు వస్తాయి. ఆ తర్వాత దరఖాస్తుదారు ఆధార్ సంఖ్యను నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు నమోదు చేయాలి. చివరగా వ్యవసాయశాఖ అధికారులు రైతుల కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం దరఖాస్తు చేసుకున్న రైతు నుంచి ధ్రువీకరణ పత్రాన్ని వ్యవసాయ అధికారులు తీసుకోనున్నారు. ఇష్టపూర్వకంగానే సమ్మతిని తెలియజేస్తున్నట్లు రైతు సంతకం చేసి అధికారికి ఇస్తే ప్రభుత్వం వివరాలను పరిశీలించనుంది.

ఇంటింటికీ వెళ్లి..

గ్రామాల వారీగా ఇప్పటి వరకు రుణమాఫీ జమ కాని రైతుల ఇళ్లకు అధికారులు నేరుగా వెళ్తున్నారు. వివరాలను పూర్తి స్థాయిలో సేకరిస్తున్నారు. రైతు కుటుంబ సభ్యులతో సహా సంబంధిత అధికారులు సెల్ఫీ తీసుకొని యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు.

పక్కాగా నమోదు



గ్రామాల్లో రుణమాఫీ కాని రైతుల ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వం రైతు భరోసా పంట రుణమాఫీ పేరిట ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో రైతుల వివరాలను పక్కాగా నమోదు చేస్తున్నాం.

– నిషాంత్‌కుమార్, ఏఓ, షాద్‌నగర్

బ్యూటీషియన్ దారుణ హత్య

ప్రేమోన్మాది ఘాతుకం

- 15కు పైగా కత్తి పోట్లు
- అడ్డు వచ్చిన మరో ముగ్గురు బ్యూటీషియన్లపై దాడి
- విద్యుత్ వైర్లు పట్టుకుని నిందితుడి ఆత్మహత్యాయత్నం



నిందితుడు రాకేష్



హత్యకు గురైన దీప్నా తమాంగ్ (ఫైల్)

గచ్చిబౌలి/మొయినాబాద్: వేరే వ్యక్తితో చనువుగా ఉంటూ తనను దూరం పెట్టిందన్న కక్షతో ఓ యువకుడు బ్యూటీషియన్‌పై కత్తితో దాడి చేసి దారుణంగా హత్య చేసిన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎస్.ఆంజనేయులు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్, కూచ్‌బీహార్ జిల్లా, లంకపాలకు చెందిన దీప్నా తమాంగ్ (26) నల్లగండ్లలోని అపర్ణ జెనిత్‌లో పీఅండ్ బీ సెలూన్‌లో బ్యూటీషియన్‌గా పని చేస్తోంది. రెండేళ్ల క్రితం బెంగళూర్‌లో పని చేస్తుండగా బీదర్‌కు చెందిన రాకేష్ (25)తో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారడంతో ఇద్దరు కొంతకాలం బాగానే ఉన్నా ఆ తర్వాత వారి మధ్య మనస్పర్థలు వచ్చాయి. రాకేష్‌ను దూరం పెట్టిన దీప్నా రెండు నెలల క్రితం బెంగళూర్ నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చి గోపన్‌పల్లి తండాలో ముగ్గురు బ్యూటీషియన్లతో కలిసి నివాసం ఉంటూ సెలూన్‌లో పని చేస్తోంది. రాకేష్ కూడా హైదరాబాద్‌కు వచ్చి అయ్యప్ప సొసైటీలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నాడు. దీప్నా వేరే వ్యక్తితో చనువుగా ఉంటున్నట్లు తెలుసుకున్న రాకేష్ తనను పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నాడు. అందుకు ఆమె అంగీకరించకపోవడంతో మంగళవారం గోపన్‌పల్లి తండాలోని ఇంటికి వెళ్లి ఆమెతో గొడవ పడ్డాడు. బుధవారం రాత్రి దీప్నా ఇంటికి వెళ్లి మరోసారి గొడవ పడటంతో ఆమె బయటికి వచ్చింది. పక్కకు వెళ్లి మాట్లాడుకుందామని కొద్దిదూరం తీసుకెళ్లిన రాకేష్ వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీనిని గమనించిన తోటి బ్యూటీషియన్లు అడ్డుకునేందుకు యత్నించగా వారిపై కత్తితో దాడి చేసి పరారయ్యాడు. ఈ ఘటనలో సావిత్రి వీపుపై, కృష్ణ లంక కుడి చేతి మణికట్టు, పునీత కుడి భుజంపై గాయాలయ్యాయి. 15కు పైగా కత్తిపోట్లకు గురై రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న దీప్నాను సిటిజన్ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సావిత్రి పరిస్థితి విషమంగా ఉందని, బాధితులు అదే హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులకు మెసేజ్ పెట్టి..

దాడి అనంతరం ఇదే చివరి రోజు అని తల్లిదండ్రులకు రాకేష్ మెసేజ్ పెట్టి బైక్‌పై వెళ్లాడు. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు బీదర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు గచ్చిబౌలి పోలీసులను సంప్రదించారు. అప్పటికే రాకేష్ కోసం గచ్చిబౌలి పోలీసులు గాలింపు చేపట్టారు. బైక్‌పై వెళ్లిన రాకేష్ మొయినాబాద్ శివార్లలో చెట్టును ఢీ కొట్టడంతో సెల్‌ఫోన్ కింద పడి పోయింది. అక్కడ నుంచి కనకమామిడి గ్రామ శివార్లలో విద్యుత్ స్తంభం ఎక్కి హైటెన్షన్ వైర్లను పట్టుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన అతను విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు 50 శాతం కాలిన గాయాలతో ఉన్న రాకేష్‌ను లంగర్‌హౌస్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరిలించారు. ఇది ఇలా ఉండగా దీప్నాకు వివాహం జరిగిందని, కుమారుడు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మనస్పర్థల కారణంగా భర్తతో కొంత కాలంగా దూరంగా ఉంటూ బ్యూటీషియన్‌గా పని చేస్తోందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్

నవరాత్రి ఉత్సవాలపై సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ మండపాలకు ఉచిత విద్యుత్‌ఇచ్చేందుకు ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి మండపాలకు ఉచిత విద్యుత్ అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై సచివాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను సంబంధించి ప్రభుత్వానికి, నిర్వాహకులకు మధ్య సమన్వయం ఉండాలన్నారు. అందరి సలహాలు, సూచనలు స్వీకరించేందుకే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నగరంలో ఎక్కడ ఉత్సవాలు నిర్వహించాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరి అన్నారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో ఉత్సవాలు నిర్వహించేలా జాగ్రత్త వహించాల్సిందిగా అధికారులకు సూచించారు.

సెప్టెంబర్ 17 ఎంతో కీలకం..

సెప్టెంబర్ 17 తెలంగాణకు చాలా కీలకమైనదని చెబుతూ, ఆరోజు జరిగే రాజకీయ, రాజకీయేతర కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకొని యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాల్సిందిగా సూచించారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనర్సింహ, ఎంపీలు అనిల్‌కుమార్ యాదవ్, కొండా విశ్వేశ్వరరెడ్డి, ప్రభుత్వ సలహాదారులు, జీహెచ్ఎంసీ మేయర్, డిప్యూటీమేయర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డీజీపీ, తదితర ఉన్నతాధికారులు, గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

డెంగీ బాధిత ప్రాంతాలను తనిఖీ చేయాలి: దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నియంత్రించడానికి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్ఎంసీ అధికారులు, జిల్లా కలెక్టర్, జోనల్, డిప్యూటీ కమిషనర్లు, చీఫ్ మెడికల్ ఆఫీసర్, ఎంటమాలజిస్టులు, ఏఎంఓహెచ్‌లు, తహసీల్దార్లు చేపట్టాల్సిన కార్యాచరణపై ఆయన దిశానిర్దేశం చేశారు. డెంగీ పాజిటివ్ కేసులున్న ప్రాంతాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని, ప్రతి రోజు బస్తీ దవాఖానాలను, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలని ఆయన ఆదేశించారు.

ధర ఢమాల్

- అమాంతం పడిపోయిన టమాటా రేటు
- పెరిగిన దిగుబడులు.. దక్కని లాభాలు
- మార్కెట్లలోనే పారబోస్తున్న రైతులు
- ఖర్చులు కూడా రావడం లేదని ఆందోళన



చేవెళ్ల మార్కెట్‌లో అమ్ముడుపోని టమాటాను పారబోసిన రైతులు

చేవెళ్ల: వరుసగా కురుస్తున్న వర్షాలు పంటలకు మేలు చేస్తున్నప్పటికీ టమాటా రైతులకు మాత్రం తీరని నష్టాన్ని మిగిలిస్తున్నాయి. చేవెళ్ల ప్రాంతంలో సాగుచేస్తున్న రైతులకు ప్రస్తుతం మంచి దిగుబడులు వస్తున్నాయి. అదే సమయంలో ఒక్కసారిగా ధరలు పడిపోవడం కలవరానికి గురిచేస్తోంది. సాగుచేసేందుకు పడిన కష్టం అటుంచి పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని వాపోతున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాలకు తడిసిన టమాటా నిల్వ ఉండకపోవడంతో పాటు దిగుబడి పెరగడం మార్కెట్‌లో ధరల పతనానికి కారణమంటున్నారు. వ్యాపారులు మార్కెట్‌లో కొనుగోలు చేసిన టమాటాను దూరప్రాంతాలకు తీసుకెళ్లేందుకు నిల్వ ఉండటండం లేదని తక్కువ మోతాదులో కొనుగోలు చేస్తున్నారు. ఒకటి రెండురోజులకు సరిపడా మాత్రమే కొంటుండడంతో దిగుబడి అలాగే ఉండిపోతోంది.

కష్టం ఖర్చులకే సరి

చేవెళ్ల పరిసర ప్రాంతాల్లో టమాటా పండిస్తున్న రైతులు నిత్యం చేవెళ్ల మార్కెట్‌కు తరలిస్తుంటారు. మార్కెట్‌లో ప్రస్తుతం కిలోకు రూ.4 నుంచి రూ.10 మాత్రమే దక్కుతోంది. ఒక్కో బాక్స్ (25 కిలోలు) రూ.100 నుంచి రూ.300 ధర పలుకుతోంది. మార్కెట్‌కు 20 బాక్స్‌లు తీసుకొస్తే రూ.2వేలు వస్తే వీటిని తీసేందుకు కూలీల ఖర్చు, మార్కెట్‌కు తరలించే రవాణ ఖర్చులకే సరిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమకు కిలో రూ.4 నుంచి రూ.10 దక్కుతుండగా బయట వ్యాపారులు మాత్రం వినియోగదారులకు కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారని.. పండించిన తమకంటే మధ్య వ్యాపారులకే లాభాలు వస్తున్నాయని వాపోతున్నారు.

పారబోస్తూ.. పశువులకు మేత వేస్తూ..

మార్కెట్‌లో ఆశించిన ధర లేకపోవడంతో అమ్ముడుపోని టమాటాను రైతులు అక్కడే పారబోస్తున్నారు. పశువులు ఉన్నవారు మేతగా వేస్తున్నారు. మరుసటిరోజు అమ్ముకుందామనుకున్నా వర్షాలకు తడవడంతో నిల్వ ఉండడం లేదు. నిల్వ చేసే వీలు లేక, చేసేది లేక పారబోస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

ధరల పతనంతో నష్టం



వరుసగా కురుస్తున్న వర్షాలతో పొలంలోనే పంట పాడవుతోంది. దీనికి తోడు మార్కెట్‌లో ధర పలకడం లేదు. ఎంతో ఆశతో సాగు చేస్తే దిగుబడల సమయంలో ధరలు లేకపోవటం బాధాకరం. ధరల పతనంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

– గోపాల్‌రెడ్డి, రైతు, దేవునిఎర్రవల్లి

ఖర్చులు కూడా రావడం లేదు



నాలుగైదేళ్లుగా దిగుబడులు వచ్చే సమయానికి మార్కెట్‌లో ధరలు ఉండటం లేదు. లాభాల మాట పక్కన పెడితే చేసిన ఖర్చులు కూడా రావటం లేదు. టమాటా సాగు చేయాలంటేనే వెనకడుగు వేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది.

– వీరేశం, రైతు, కుమ్మెర

ఆర్థిక ఇబ్బందులతో..

వ్యక్తి ఆత్మహత్య


మధు (ఫైల్)

మీర్‌పేట: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం. జిల్లెలగూడ రాఘవేంద్రనగర్‌కు చెందిన మీసమోని మధు (35) మిథానిలో కార్మికుడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం. మధు కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

డ్యూటీకి వెళ్లి వస్తుండగా..

కారు ఢీకొని ఎయిర్‌పోర్టు ఉద్యోగి మృతి

శంషాబాద్: రోడ్డు ప్రమాదంలో ఎయిర్‌పోర్టు ఉద్యోగి మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.జయశంకర్ భూపాలపల్లి జిల్లా, దుబ్బల గ్రామానికి చెందిన సంగీ మహేష్ (33) పట్టణంలోని సిద్దాంతిలో ఉంటూ ఎయిర్‌పోర్టులోఉద్యోగం చేస్తున్నాడు. గురువారం తెల్లవారు జామున డ్యూటీ ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళుతున్న అతను సిద్దాంతి సమీపంలో నీమ్ ట్రీ హోటల్ వద్ద గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీ కొనడంతో మహేష్ ఎదురుగా నిలిపి ఉన్న కారును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పడుకున్న చోటే వ్యక్తి మృతి

శంషాబాద్: ఇంట్లో పడుకున్న చోటే వ్యక్తి మృతిచెందిన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇంద్రారెడ్డి కాలనీలో నివాసముంటున్న నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన మైసయ్య భార్య, పిల్లలు ఇటీవల రాఖీ పండగకు సొంతూరుకెళ్లారు. రెండురోజులుగా ఇంటి తలుపులు తెరిచి లేకపోవడంతో యజమానులు ఇంట్లోకి వెళ్లి చూడగా పడుకున్న చోటే మైసయ్య (44) మృతిచెంది ఉండడంతో గ్రామంలో ఉన్న కుటుంబ సభ్యులకు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నగరంలో నర్సరీ మేళా

నగరంలోని నెక్లెస్ రోడ్ పీపుల్స్‌ప్లాజా వేదికగా గురువారం ఆల్ ఇండియా హార్టికల్చర్‌షోను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. నర్సరీ మేళాలో రూ.50 నుంచి రూ.3 లక్షల ఖరీదైన మొక్కలు అందుబాటులో ఉన్నాయి. మేళా సెప్టెంబర్ 2 వరకు కొనసాగనుంది.

– సాక్షి, సిటీబ్యూరో







హబ్సిగూడలో మరో విషాదం

లారీ ఢీకొని ఆరో తరగతి విద్యార్థిని దుర్మరణం

- ఇదే ప్రాంతంలో పది రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పదో తరగతి విద్యార్థిని


తల్లి ఒడిలో గాయాలతో కామేశ్వరి


ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టిన లారీ


కామేశ్వరీ (ఫైల్)

లాలాపేట: దాదాపు 10 రోజుల క్రితం తార్నాకకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఆటోలో స్కూల్‌కు వెళ్తుండగా.. హబ్సిగూడ చౌరస్తాలో లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన దుర్ఘటన మరవక ముందే అదే హబ్సిగూడలో గురువారం మరో విషాదం చోటుచేసుకుంది. స్కూటీపై వెళ్తున్న విద్యార్థినిని లారీ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన అందరినీ కలచివేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాక హనుమాన్ నగర్‌కు నీలం కుమార్ కుమార్తె శ్రీకామేశ్వరి (10) హబ్సిగూడలోని జాన్సన్ గ్రామర్ స్కూల్లో 6వ తరగతి చదువుతోంది. ఇదే పాఠశాలలో ఆమె తమ్ముడు వేదాన్ 2వ తరగతి చదువుతున్నాడు. గురువారం సాయంత్రం స్కూల్ ముగించుకుని తల్లి సంతోషితో స్కూటీ వెనకాల కూర్చుని తార్నాకలోని వీరి ఇంటికి బయలుదేరారు. హబ్సిగూడలోని అన్‌లిమిటెడ్ షోరూం సమీపంలోకి రాగానే.. ఉప్పల్ వైపు నుంచి ఓవర్ లోడుతో వచ్చిన లారీ.. వెనకవైపు నుంచి వీరి స్కూటీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటీపై నుంచి తల్లి సంతోషి, కుమారుడు వేదాన్ష్ ఎడమవైపు ఎగిరి కింద పడ్డారు. కుడివైపు పడిన కామేశ్వరి కాలుపై నుంచి లారీ చక్రాలు వెళ్లగా తీవ్ర గాయాలయ్యాయి. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న బిడ్డను చూసి తల్లి సంతోషి రోదనలు ఆ ప్రాంతంలో మిన్నంటాయి. కామేశ్వరిని వెంటనే అంబులెన్స్‌లో హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ రాజస్థాన్‌కు చెందిన మియారామ్ జాట్‌గా గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఓయూ పోలీసులు తెలిపారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధిద్దాం

కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు


మాట్లాడుతున్న నాగేశ్వర్‌రావు

ఇబ్రహీంపట్నం: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కాలుష్య నియంత్రణ మండలి సీనియర్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.నాగేశ్వర్ రావు అన్నారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'మట్టి గణపతి–మహా గణపతి' పేరుతో కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ సమతుల్యతకు 33 శాతం అడవులుండాలన్నారు. గాలి,నీరు కలుషితం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలకు మట్టి గణపతిని పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు, వినాయక ప్రతిమ తయారు చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాధిక, వైస్ ప్రిన్సిపాల్ సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ రచన, డాక్టర్ రమేష్, అకడమిక్ కోఆర్డినేటర్ నరేందర్ రెడ్డి, నాక్ కోఆర్డినేటర్ శ్రీకృష్ణ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. విభూతి బ్రదర్స్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆట పాటలు అలరించాయి.

అంతర్రాష్ట్ర దొంగల ముఠాకు రిమాండ్

పరారీలో మరో ఇద్దరు

- నిందితుల నుంచి రూ.పదివేలు రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రంగస్వామి

షాద్‌నగర్‌రూరల్: అంతర్రాష్ట్ర దొంగల ముఠాలోని ఇద్దరు సభ్యులను షాద్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఏసీపీ రంగస్వామి తెలపిన ప్రకారం.. బెంగుళూరుకు చెందిన గంగాధర్, అనిల్, హన్మంత్‌రాజ్, పృథ్వీరాజ్, అభి అలియాస్ అభిషేక్, శశి ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటు పడిన వారు బెంగుళూరుతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇదే క్రమంలో ఈ నెల 19న కారులో పట్టణానికి చేరకుని అర్ధరాత్రి ఐదు దుకాణాల్లో చోరీకి పాల్పడి తిరిగి బెంగుళూరు పారిపోయారు. బెంగుళూరులోని సుబ్రమణ్యంపురం ఠాణా పరిధిలో జరిగిన చోరీ విచారణలో భాగంగా అక్కడ పోలీసులు గంగాధర్, అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారు షాద్‌నగర్‌లో దొంగతనం చేసినట్లు ఒప్పుకొన్నారు. బెంగుళూరు పోలీసుల సహకారం, సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి ముఠాలోని హన్మంత్‌రాజ్, పృథ్వీరాజ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అభి, శశి పరారీలో ఉన్నారన్నారు. నిందితుల నుంచి రూ.10వేలు రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ కేసు ఛేదించడంలో పట్టణ సీఐ విజయ్‌కుమార్, సీసీఎస్ సీఐ పవన్, డిటెక్టివ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ శరత్‌కుమార్, సిబ్బంది నరేందర్, కృష్ణ, శంకరయ్య, మహేశ్, రాజేశ్, రఫీ చాకక్యంగా వ్యవహరించారని ఏసీపీ వారిని అభినందించారు.

పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

పెద్దఅడిశర్లపల్లి: తన స్నేహితుడి సోదరి పెళ్లి కార్డులు పంచేందుకు వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి గ్రామ స్టేజీ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం అందుగుల పెద్దతండాకు చెందిన నేనావత్ రాజేష్(19), అదే మండలం పల్లెతండాకు చెందిన తన స్నేహితుడు కేతావత్ సంతోష్ సోదరి పెళ్లి కార్డులు పంచేందుకు నాగార్జునసాగర్ పరిధిలోని నాగార్జునపెంట తండాకు బైక్‌పై వెళ్తున్నారు. మార్గమధ్యలో పెద్దఅడిశర్లపల్లి మండలం చిల్కమర్రి గ్రామ స్టేజీ సమీపంలో రాగానే కోదాడ– జడ్చర్ల జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న నేనావత్ రాజేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న సంతోష్‌కి తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గుడిపల్లి ఎస్ఐ ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని, క్షతగాత్రుడిని దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమ పేరుతో వేధింపులు

బాలిక బలవన్మరణం

మైలార్‌దేవ్‌పల్లి: ప్రేమ పేరుతో ఓ యువకుడు వేధిస్తుండటంతో మనస్తాపానికి లోనైన ఓ బాలిక ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన బాలికను కొన్నాళ్లుగా మహేశ్వరం ప్రాంతానికి చెందిన యువకుడు ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో మనస్తాపానికి లోనైన బాలిక ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం

అత్తాపూర్: ఓ వృద్ధుడు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కానిస్టేబుల్ నీలిమ తెలిపిన వివరాల ప్రకారం.. సర్దార్‌దీప్‌సింగ్ (60)తన కుమార్తె సీతల్ ఇంటిలో ఉంటున్నాడు. ఆగస్టు 20న సాయంత్రం ఇంట్లో నుంచి వెళ్లిపోయిన అతను తిరిగి ఇంటికి రాకపోవడంతో కుమార్తె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మొహంపై యాసిడ్ పోసి.. దారి దోపిడీ

బంజారాహిల్స్: విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఓ యువకుడిని ఆరుగురు ఆగంతకులు అర్ధరాత్రి అడ్డగించి డబ్బులు లాక్కోవడమే కాకుండా తమను గుర్తు పట్టవద్దనే ఉద్దేశంతో ముఖంపై యాసిడ్ పోసి గాయపరిచిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..వెస్ట్‌బెంగాల్‌కు చెందిన నసీంమాలిక్ బుధవారం అర్ధరాత్రి విధులు ముగించుకుని బంజారాహిల్స్ రోడ్డునెంబర్–13లోని శ్మశానవాటిక ముందు నుంచి నడుచుకుంటూ జహీనగర్ వైపు వెళ్తున్నాడు. అర్ధరాత్రి ఆరుగురు యువకులు నసీంను అడ్డగించి తీవ్రంగా కొట్టి అతడి జేబులో ఉన్న రూ.500 లాక్కున్నారు. అనంతరం తమను గుర్తుపట్టకుండా నసీంను బలవంతంగా శ్మశానవాటికలోకి లాక్కెళ్లి ముఖంపై, చేతులపై, మెడపై యాసిడ్ పోశారు. దీంతో బాధితుడు తన స్నేహితుడు నూర్‌హుస్సేన్‌ను పిలిపించుకుని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రిలో చేరాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్న బంజారాహిల్స్ పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

సంతానం కలగడం లేదని ఆత్మహత్య

రాజేంద్రనగర్: వివాహం జరిగి 11 ఏళ్లయినా సంతానం కలగకపోవడంతో మనస్తాపానికి లోనైన ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ప్రేమావతిపేట ప్రాంతానికి చెందిన స్వాతి (30)కి ఉప్పర్‌పల్లికి చెందిన శ్రీధర్‌తో 2013లో వివాహం జరిగింది. అయితే ఆమెకు సంతానం కలుగలేదు. గత కొన్ని రోజులుగా పుట్టింట్లోనే ఉంటున్న స్వాతి బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గురువారం తెల్లవారుజామున దీనిని గుర్తించిన కుటుంబ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

- బైక్‌ను ఢీకొట్టిన కారు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి


శ్రావణ్(ఫైల్)

మంచాల: బంధువుల పెళ్లికి వెళ్లిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన ఆరుట్ల గ్రామ సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని కాగజ్‌ఘట్ గ్రామానికి చెందిన చెంచలి శ్రావణ్(25) ఆరుట్లలో బంధువుల వివాహానికి హాజరయ్యాడు. రాత్రి తన బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా ఆరుట్ల రైస్‌మిల్ చౌరస్తాలో ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మంచాల పోలీసులు కేసు నమోదు చేసుకుని.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

రోడ్డున పడ్డ కుటుంబం

శ్రవణ్ చిన్నతనంలోనే తండ్రి నగేశ్ మృతి చెందాడు. చెల్లెలు కూడా కొన్నేళ్ల క్రితం జాండిస్‌తో చనిపోయింది. తల్లి రేణుక కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కొడుకు పైనే ఆశలు పెట్టుకుని జీవిస్తున్న ఆమె కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం


పిల్లలతో కలిసి అదృశ్యమైన మంగమ్మ

శంషాబాద్ రూరల్: డబ్బుల విషయంలో భర్తతో గొడవ పడిన మహిళ, తన ఇద్దరు పిల్లలతో అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కవ్వగూడకు చెందిన మంగళారమ్ శేఖర్, మంగమ్మ దంపతులకు కొడకు, కూతురు ఉన్నారు. మంగమ్మ తన భర్త సోదరుడు జేబులో నుంచి రూ.500 తీసుకుంది. ఈ విషయంలో భార్య, భర్తలు గొడవపడ్డారు. ఈ క్రమంలో ఈ నెల 28న ఆటో డ్రైవింగ్ చేయడానికి బయటకు వెళ్లిన భర్తకు మంగమ్మ ఫోన్ చేసి ఇంటికి రమ్మంది. కోపంలో ఉన్న భర్త తాను రాలేనంటూ ఫోన్‌ను కట్ చేశాడు. రాత్రి ఇంటికి వచ్చి చూడగా.. భార్య మంగమ్మ(20), కూతురు ఉషా(4), కొడుకు జగదీష్(1) ఇంట్లో కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా మంగమ్మ ఇంటి నుంచి వెళ్లి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చిందని భర్త తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మహిళా సెక్యూరిటీ గార్డు బలవన్మరణం

ఉప్పల్: ఓ మహిళా సెక్యూరిటీ గార్డు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రామంతాపూర్ వెంకటరెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన షేక్ అమీర్ బాషా భార్య షేక్ షాయిన్(36) సికింద్రాబాద్ మెట్రో స్టేషన్‌లో సెక్యురిటీ గార్డుగా పని చేస్తుంది. ఈ నెల 28న డ్యూటీకి వెళ్లిన ఆమె సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన ఆమె కుమారుడు షేక్ షకీరా పాషా తలుపు తట్టినా తీయక పోవడంతో కిటికీలోనుంచి చూడగా షేక్ షాయిన్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కనిపించింది. దీంతో అతను ఇరుగు పొరుగు సహాయంలో ఆమెను కిందకు దించి ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.